క్లుప్తంగా

త్రిలోక పుణ్యక్షేత్రంలో వైకుంఠ ఏకాదశి పూజలు

బేస్తవారిపేట: స్థానిక దరగా రోడ్డులోని త్రిలోక పుణ్యక్షేత్రంలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 10వ తేదీన వైకుంఠ ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. స్వామివారికి పంచామృత అభిషేకాలు, అష్టోత్తర పూజ, ప్రత్యేక అలంకరణ, ఉత్తర ద్వారం నుంచి దర్శనం జరుగుతుందన్నారు. మధ్యాహ్నం అన్నసంతర్పణ, సాయంత్రం గ్రామోత్సవం ఏర్పాటు చేశామన్నారు.

అడవుల సంరక్షణపై అవగాహన

అర్ధవీడు: మండలంలోని పాపినేనిపల్లిలో బుధవారం అడవుల పరిరక్షణ మానవాళికి మనుగడ అనే అంశంపై ఎఫ్‌బీఓ మురళీకృష్ణ అధ్యక్షతన అవగాహన సమావేశం నిర్వహించారు. అడవులను సంరక్షించుకుంటే స్వచ్ఛమైన గాలితో పాటు వర్షాలు సకాలంలో కురిసి పంటలు బాగా పండుతాయన్నారు. ఫారెస్టు అధికారులు రంగయ్య, పుల్లారావు, రంగారెడ్డి, బాలాజీనాయక్ పాల్గొన్నారు.

బీసీ రుణాలకు దరఖాస్తు చేసుకోవాలి

రాచర్ల: బీసీ కార్పొరేషన్ 2024–25 సబ్సిడీ రుణాలు పొందేందుకు గ్రామ సచివాలయాల్లో ఈ 16వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో ఎస్.వెంకటరామిరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో సూచించారు. సబ్సిడీ రుణాల కోసం బీసీ-ఏ, బీసీ-బి, బీసీ-డీ, బీసీ-ఈ, ఈడబ్ల్యూఎస్, ఈబీసీ, రెడ్డి, వైశ్యులు సబ్సిడీ రుణాలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పూర్తి సమాచారం కోసం సచివాలయాల్లోని పంచాయతీ కార్యదర్శులను సంప్రదించాలని కోరారు.

కొమరోలు: మండలంలో బీసీ కార్పొరేషన్‌కు సంబంధించి 33 యూనిట్ల సబ్సిడీ రుణాలు మంజూరు చేసినట్లు ఎంపీడీఓ మస్తాన్‌వలి తెలిపారు. 2024–25 సంవత్సరానికి సంబంధించి బ్యాంక్ లింకేజ్ సబ్సిడీ రుణాల కోసం 33 యూనిట్లకు 64 లక్షల రూపాయలు, ఇడబ్ల్యూఎస్ యాక్షన్ ప్లాన్ కింద ఓబీఎంఎంఎస్ 7 యూనిట్లకు 12 లక్షల రూపాయలు మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ నెల 16వ తేదీలోపు అర్హులైన వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

చలో కలెక్టరేట్‌ను విజయవంతం చేయాలి

బేస్తవారిపేట: భారత కమ్యూనిస్ట్ పార్టీ, భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో ఈ నెల 10వ తేదీన జరిగే చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి కె.రమణ, సహాయ కార్యదర్శి జోసఫ్‌లు కోరారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ నివేశన స్థలాలు కేటాయించాలని, నియోజకవర్గంలో సాగుకు అనుకూలమైన అటవీ, బంజరు భూములు భూమిలేని నిరుపేదలకు పంపిణీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇంటి నిర్మాణాలకు రూ.5 లక్షలు కేటాయించాలని, అసైన్‌మెంట్ కమిటీలను ఏర్పాటు చేయాలని కోరుతూ కార్యక్రమం చేపడుతున్నామని పేర్కొన్నారు.

ఫార్మర్ రిజిస్ట్రేషన్ కోసం దరఖాస్తు చేసుకోవాలి

కొమరోలు: మండలంలోని రైతులు ఫార్మర్ రిజిస్ట్రేషన్ కోసం దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారి రాజశ్రీ తెలిపారు. మండలంలోని అల్లినగరం, గోనపల్లె గ్రామాల్లో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజశ్రీ మాట్లాడుతూ గ్రామవ్యవసాయ, ఉద్యాన, పట్టుపరిశ్రమ సహాయకులు ఫార్మర్ రిజిస్ట్రేషన్ వెబ్‌సైట్‌లో రైతుల వివరాలు నమోదు చేస్తారన్నారు. రైతు రిజిస్ట్రేషన్ పోర్టర్‌లో నమోదు చేసిన అనంతరం రైతులకు ప్రత్యేక సంఖ్య కేటాయిస్తారని, వివరాల కోసం రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించాలని పేర్కొన్నారు.

పార్శిల్ కార్యాలయాల తనిఖీ



పార్శిల్ ఆఫీసులో తనిఖీ చేస్తున్న ఎక్సైజ్ సీఐ

కంభం: కార్గో పార్శిల్ సర్వీస్, ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసుల్లో బుధవారం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ కొండారెడ్డి తనిఖీలు నిర్వహించారు. ఇటీవల కాలంలో నిషేధిత వస్తువులు రవాణాకు పలువురు కార్గో సర్వీస్‌లను వినియోగించుకుంటున్న నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తనిఖీలు నిర్వహించినట్లు ఆయన పేర్కొన్నారు. ఎటువంటి నిషేధిత వస్తువులు లభించలేదని తెలిపారు. అనుమానాస్పదంగా ఏవైనా వస్తువులు బుకింగ్ కోసం వస్తే వెంటనే సమాచారం అందించాలని ఆయన కోరారు.

నేడు డయల్ యువర్ డీఎం

మార్కాపురం రూరల్: మార్కాపురం ఆర్టీసీ డిపో పరిధిలో ఈనెల 9వ తేదీ ఉదయం 10 నుంచి 11 గంటల వరకు డయల్ యువర్ డిపో మేనేజర్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని డీఎం ఏఎస్ నరసింహులు తెలిపారు. ప్రయాణికులు 99592 25699కు ఫోన్ చేసి సమస్యలు, సలహాలు తెలియజేయాలని బుధవారం ఓ ప్రకటనలో కోరారు.



పొదిలి పట్టణ వ్యూ



వర్షం కురిస్తే ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఇలా..



పెద్ద మసీదు వద్ద ప్రధాన రోడ్డు



అలుగు కాలువ దుస్థితి

అధోగతి..పృథులాపురి పురోగతి

అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్నట్టుగా ఉంది పొదిలి నగర పంచాయతీ పరిస్థితి. పృథులాపురిగా పేరున్న పొదిలి పట్టణ పురోగతి నానాటికీ తీసికట్టుగా మారింది. అభివృద్ధి పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారయ్యాయి. పేరుకు నగర పంచాయతీ అయినా ఇక్కడి సమస్యలు మాత్రం మారుమూల పంచాయతీని తలపిస్తున్నాయి. సుమారు 45వేల జనాభా, 20 వార్డులు, 9వేల నివాస గృహాలు కలిగిన పొదిలి అభివృద్ధి పథంలో ఎప్పుడు పయనిస్తుందో, సమస్యలు ఎప్పుడు తీరుతాయోనని ప్రజలు ఆశగా ఎదురు చూస్తున్నారు.

- అభివృద్ధి ఊసే లేని పొదిలి నగర పంచాయతీ
- నిత్యం వెంటాడుతున్న ట్రాఫిక్ సమస్య
- ముందుకు సాగని తాగునీటి పథకాల పనులు
- జనాభాకు అనుగుణంగా లేని పారిశుధ్య కార్మికులు
- అధ్వానంగా పట్టణ అంతర్గత రోడ్లు

పొదిలి: జిల్లా నడిబొడ్డున ఉన్న పొదిలి మేజర్ పంచాయతీ నుంచి నగర పంచాయతీగా అప్ గ్రేడ్ అయినా కనీస మౌలిక వసతులు కరువయ్యాయి. 2020 డిసెంబర్ 30వ తేదీన నగర పంచాయతీగా రూపాంతరం చెందిన పొదిలిలో చెప్పుకోదగిన అభివృద్ధి పనులేవీ చేపట్టలేదు. పొదిలి మేజర్ పంచాయతీలో భాగమైన కంభాలపాడు, మాదాలవారిపాలెం, నందిపాలెం గ్రామాలను కలుపుతూ నగర పంచాయతీ ఏర్పాటు చేయగా దీనిపై పలువురు కోర్టుకు వెళ్లడంతో తదుపరి ప్రక్రియ నిలిచిపోయింది.



నిర్మలా కాన్వెంట్ రోడ్డు పరిస్థితి ఇదీ..

వెంటాడుతున్న మంచినీటి సమస్య

గతంలో బుగ్గ జలం నీటి పథకం ద్వారా పొదిలికి నీరు పుష్కలంగా అందేవి. కాలక్రమంలో సాగర్ నీరు వచ్చాయి. అయితే జనాభా పెరగడం, పథకాలు పాతవి కావటంతో నీటి సమస్య తలెత్తింది. శివారు ప్రాంతాల్లో నీటి ఎద్దడి అధికంగా ఉంది. నేతపాలెంలో నీటి కుళాయిలు డ్రెయినేజీల్లో కలిసిపోయాయి. పాతకాలం నాటి పైపులు కావడంతో నిత్యం లీకేజీలు ఏర్పడి నీరు కలుషితమవుతోంది. సాగర్ నీరు రెండు లేదా మూడు రోజులకు ఒక పర్యాయం ఇస్తుండటంతో ప్రజలు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో ట్యాంకర్లతో నీరు సరఫరా చేస్తున్నారు కానీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు.

ఎస్‌ఎస్ ట్యాంకు పథకం ఆగినట్లేనా?

నీటి సమస్య శాశ్వత పరిష్కారం కోసం గత ప్రభుత్వంలో రూ.50 కోట్ల నిధులు మంజూరు చేశారు. దర్శి నుంచి పైపు లైన్ల ద్వారా పెద్ద, చిన్న చెరువులకు సాగర్ నీరు నింపి తాగునీటి అవసరాలు తీర్చాలనేది పథకం లక్ష్యం. పథకం పనులు ప్రారంభమై కొంత మేర జరిగాయి. ఎన్నికల నేపథ్యంలో నిలిచిన పనులను కూటమి ప్రభుత్వం నేటికీ ప్రారంభించలేదు.



సాగర్ పైపు లైను కోసం తెచ్చిన పైపులు

తీరని ట్రాఫిక్ కష్టాలు

జిల్లా నడికూడలి కావడంతో పొదిలి మీదుగా వాహనాల రాకపోకలు ఎక్కువే. ఇరుకు రోడ్లు కావడం, ఆక్రమణలు పూర్తి స్థాయితో తొలగించక పోవడంతో ట్రాఫిక్ కష్టాలు తప్పడం లేదు. రోడ్ల అభివృద్ధి, సైడు కాలవల నిర్మాణం, సెంట్రల్ లైటింగ్, డివైడర్ల ఏర్పాటు కోసం గత ప్రభుత్వం రూ.11 కోట్లు మంజూరు చేయగా.. అధికారులు సకాలంలో స్పందించకపోవడంతో వెనక్కి పోయాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి.



నేతపాలెంలో మంచి నీటి కుళాయిలు

పొదిలి జనాభా	సుమారు 45 వేలు
వార్డుల సంఖ్య	20
నివాసాలు	9 వేలు
పారిశుధ్య కార్మికులు	ఉన్నది 70 ఉండాల్సింది 180

ఆక్రమణల సమస్య యథాతథం

పొదిలిలో ట్రాఫిక్ సమస్యకు ప్రధాన కారణం ఆక్రమణలేనని పేర్కొంటూ అధికారులు తొలగింపు చర్యలు చేపట్టారు. దీంతో వందలాది మంది చిరువ్యాపారులు రోడ్డున పడగా.. ట్రాఫిక్ సమస్య ఏమాత్రం పరిష్కారం కాలేదు. కొందరు దుకాణదారులు యథావిధిగా మట్టిపోసి ఎత్తు పెంచుకున్నారు.

సమస్యగా మారిన అలుగు కాలువలు

పట్టణాన్ని రెండుగా విడగొట్టేలా అలుగు కాలువ ఉంది. ఈ కాలువకు ఇరువైపులా నివాస గృహాలు ఉన్నాయి. ఎక్కడి నీరు అక్కడ నిల్వ ఉండి, పిచ్చి చెట్లు పెరిగి దుర్వాసనతోపాటు దోమలు వృద్ధి చెందుతున్నాయి. ఇటీవల కాలువ వెంట చిల్లచెట్లు తొలగించినా పరిస్థితి ఎప్పటిలా మారింది.

కార్మికుల కొరత

జనాభాకు అనుగుణంగా పారిశుధ్య కార్మికులను నియమించకపోవడంతో పారిశుధ్యం అధ్వానంగా మారింది. పట్టణంలో 180 మంది కార్మికులకు గాను 70 మందే పనిచేస్తున్నారు. కార్మికులపై పనిభారం పెరగడంతో పారిశుధ్య పనులపై తీవ్ర ప్రభావం పడుతోంది. సైడు కాలువల్లో చెత్త పేరుకు పోవడంతోపాటు మురుగు నిల్వ చేరి దుర్వాసన వస్తోంది. దోమల బెడదతో ప్రజలు జ్వరాలబారిన పడుతున్న పరిస్థితి ఉంది.

రూ.117 కోట్ల అమృత్ నిధులు



నగర పంచాయతీ అభివృద్ధికి అమృత్ పథకంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం రూ.117 కోట్ల నిధులు మంజూరు చేసింది. రామతీర్థం జలాలను ట్యాంకులకు తరలించి పైప్‌లైన్లు, కుళాయిలు ఏర్పాటు చేయడం ద్వారా నీటి సమస్యను పరిష్కరించే అవకాశం ఉంది. ఎస్‌డీఏఆర్‌ఎఫ్ నిధులు రూ.1.88 కోట్లు మంజూరయ్యాయి. రోడ్లు, సైడు కాలువల అభివృద్ధి పనులు చేసేందుకు అవకాశం ఉంది.

– శ్రీనివాసరావు, కమిషనర్

అంతంతమాత్రంగా అంతర్గత రోడ్లు

శివారు ప్రాంతాల్లో మెటల్ రోడ్లు కావడంతో గుంతలు ఏర్పడి, వర్షం నీటితో నిండి రాకపోకలకు సమస్యగా మారింది. టైలర్స్ కాలనీ, నిర్మలా కాన్వెంట్ రోడ్డు, పిచ్చిరెడ్డి తోట, ప్రకాశ్‌నగర్‌లో కొంత ప్రాంతం, కేవీ పాలెం బీసీ కాలనీ, సాయి బాలాజీ నగర్, కంభాలపాడు, నందిపాలెం, మాదాలవారిపాలెంలో అంతర్గత రహదారులు అధ్వానంగా ఉన్నాయి. తగినన్ని నిధులు మంజూరు చేయించి సమస్యలు పరిష్కారం చేయడం తోపాటు, కోర్టులో వ్యాజ్యం పరిష్కారం అయ్యేలా చూసి పాలక వర్గం ఎన్నుకునేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

వైఎస్ జగన్‌ను కలిసిన అన్నా రాంబాబు



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో అన్నా రాంబాబు, షంషేర్ అలీబేగ్ తదితరులు

మార్కాపురం: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని బుధవారం రాత్రి తాడేపల్లిలోని కార్యాలయంలో ఆ పార్టీ మార్కాపురం ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు, ఏపీ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ షంషేర్ అలీబేగ్, మార్కెట్ యార్డ్ మాజీ డైరెక్టర్ బీసీ సంక్షేమ సంఘ జాతీయ కార్యదర్శి పీఎల్పీ యాదవ్‌తోపాటు మరి కొంతమంది పార్టీ నాయకులు కలిశారు. ఈ సందర్భంగా మార్కాపురం నియోజకవర్గంలో పార్టీ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని, కార్యకర్తలకు అండగా ఉండాలని వైఎస్ జగన్ సూచించినట్లు నేతలు పేర్కొన్నారు. వీరి వెంట పార్టీ నాయకులు లయోలా చెంచి రెడ్డి, ఎం.శ్రీనివాసులు, రఘుపతి శివ తదితరులు ఉన్నారు.

ఆధార్ అప్‌డేట్ చేయించుకోవాలి



తల్లిదండ్రులకు ఆధార్ నమోదు పత్రాలు అందజేస్తున్న ఎంపీడీఓ

పొదిలి రూరల్: ప్రతి ఒక్కరూ ఆధార్ కార్డు అప్‌డేట్ చేయించుకోవాలని ఎంపీడీఓ జి.శోభన్‌బాబు సూచించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పొదిలి, కొనకనమిట్ల మండలాల చిన్నారుల కోసంఆధార్ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. పొదిలి, కొనకనమిట్ల మండలాలలకు చెందిన ఆరేళ్ల లోపు చిన్నారులు 85 మందికి ఆధార్ నమోదు చేయనున్నట్లు చెప్పారు. ఆధార్ నమోదు చేసుకున్న వారికి పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సీడీపీఓ సుధా మారుతి, సిబ్బంది పాల్గొన్నారు.

బహిరంగంగా మద్యం తాగితే కఠిన చర్యలు

మార్కాపురం: మార్కాపురం పట్టణంలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న వారిపై కేసులు నమోదు చేసినట్లు టూటౌన్ ఎస్సై డాక్టర్ రాజమోహన్‌రావు తెలిపారు. గత రెండు రోజులుగా పూల సుబ్బయ్య కాలనీ, అల్లూరి పోలేరమ్మ గుడి, వై జంక్షన్ తదితర ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టి, బహిరంగంగా మద్యం తాగుతున్నవారిని గుర్తించి కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఉదయం పూట కూడా మద్యం తాగి వాహనాలు నడుపుతున్న ఇద్దరిపై కేసులు నమోదు చేశామని, హెల్మెట్ లేకుండా వాహనాలు నడుపుతున్న 20 మందికి జరిమానా విధించామని ఎస్సై వివరించారు.



డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ చేస్తున్న టూటౌన్ ఎస్సై

గిద్దలూరులో కోతుల పట్టివేత

గిద్దలూరు రూరల్: పట్టణంలో కోతుల బెడద అధికంగా ఉన్న నేపథ్యంలో మున్సిపల్ కమిషనర్ ఆదేశాల మేరకు బుధవారం రెండు రోజులుగా కోతులను పట్టే కార్యక్రమం చేపట్టారు. సుమారు 42 కోతులను పట్టించి నల్లమల అటవీ ప్రాంతానికి తరలిస్తున్నట్లు అధికారులు తెలిపారు. కోతుల బెడద నుంచి విముక్తి చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



అధికారులు పట్టించిన కోతులు

గోదాదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు



గోదాదేవికి పూజలు చేస్తున్న మహిళా భక్తులు

మార్కాపురం: ధనుర్మాసం సందర్భంగా బుధవారం స్థానిక కంభం రోడ్డులోని ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో మహిళా భక్తులు గోదాదేవి అమ్మవారికి 24వ రోజు తిరుప్పావై పాశురాలు చదివి ప్రత్యేక హారతులిచ్చారు. వెంకటేశ్వరస్వామి, అమ్మవారి మూలవిగ్రహమూర్తులను అర్చకుడు అరుణ్‌కుమార్ ప్రత్యేకంగా తులసీమాల, వివిధ రకాల పూలు, ఆభరణాలతో అలంకరించారు. మహిళా భక్తులు గోదాదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కార్యదర్శి నిట్టూరి రమేష్‌తోపాటు పలువురు కమిటీ సభ్యులు పాల్గొని తీర్థప్రసాదాలు అందించారు. ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని స్వామివారి ఆలయంలో ఉత్తర ద్వార దర్శనాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈనెల 13న గోదా రంగనాథుల కల్యాణోత్సవాన్ని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.



స్వామివారికి హారతులిస్తున్న భక్తులు

పింఛన్ల లబ్ధిదారులకు వైద్య పరీక్షలు



పింఛన్‌దారుడిని పరీక్షిస్తున్న డాక్టర్లు

బేస్తవారిపేట: మండలంలో అనారోగ్యంతో మంచానికే పరిమితమై రూ.15 వేల పింఛన్ పొందుతున్న లబ్ధిదారుల గృహాల వద్దకే వెళ్లి పీహెచ్‌సీ డాక్టర్లు బుధవారం వైద్య పరీక్షలు చేశారు. బేస్తవారిపేట పీహెచ్‌సీ వైద్యాధికారి పృథ్వీరాజ్, పొదిలి సీఎస్‌సీ, గిద్దలూరు ఆర్థోపెడిక్ డాక్టర్లు సీతారామిరెడ్డి, ఆశోక్‌కుమార్‌ల బృందం మండలంలోని జేసీ అగ్రహారంలో ముగ్గురు, చెట్టిచర్లలో ఒకరు, కోనపల్లెలో ఒకరు, గలిజేరుగుళ్లలో ఇద్దరు, అక్కపల్లెలో ఒకరు, ఎంపీ చెరువులో నలుగురు, బసినేపల్లెలో నలుగురు, పూసలపాడులో ముగ్గురు, మోక్షగుండంలో ఒక్కరు, పెద్ద ఓబినేనిపల్లెలో ఒక్కరు, సలకలవీడులో ముగ్గురు, బేస్తవారిపేటలో 16 మంది, నేకునాంబాద్‌లో ఆరుగురు మొత్తం 46 మంది లబ్ధిదారుల గృహాలకు వెళ్లి లబ్ధిదారులకు వైద్య పరీక్షలు చేశారు. తనిఖీల నివేదికను ఉన్నతాధికారులకు పంపనున్నట్లు పేర్కొన్నారు.

సంక్రాంతి సంబరాలు ఎలా చేయాలి?

రాచర్ల: గ్రామ పంచాయతీల్లో చేసిన అభివృద్ధి పనులకు అధికారులు బిల్లులు చేయకుంటే గ్రామాల్లో సంక్రాంతి సంబరాలు ఎలా చేయలాంటూ స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి వచ్చిన అధికారులను ప్రజాప్రతినిధులు నిలదీశారు. ఎంపీపీ షేక్ ఖాశింబీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. రెవెన్యూపై సమీక్ష జరుగుతున్న సమయంలో జేపీ చెరువు, అకవీడు ఎంపీటీసీలు జెట్టి వెంకటేశ్వర్లు, నందం రవి మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులు జరిగే సమయంలో ఎంపీటీసీలకు ఎలాంటి సమాచారం లేకుండా గుట్టుచప్పుడుగా గ్రామసభలు నిర్వహించుకుని వెళ్లిపోయారని ఆరోపించారు. అంతేగాక జేపీ చెరువు వీఆర్వో గ్రామ సచివాలయంలో కేవలం ఒక గంట పాటు ఉండి వెంటనే మండల కేంద్రానికి వెళ్లిపోతున్నాడని, దీంతో రైతులు, విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. పంచాయతీల్లో చేసిన అభివృద్ధి పనులకు బిల్లులు చేయకుండా అధికారులు కాలయాపన చేస్తున్నారని, సంక్రాంతి పండగ వస్తున్న సమయంలో గ్రామల్లో వీధి దీపాలు వేయలేని పరిస్థితి నెలకొందని చినగానిపల్లె, అనుములపల్లె, చోళ్లవీడు సర్పంచ్‌లు పగడాల రమేష్, సరిగిరి రమేష్, గోతం నారాయణ అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పంచాయతీల్లో చిల్లిగవ్వ ఇవ్వకుండా ప్రభుత్వ ప్రవేశ పెడుతున్న సంక్రాంతి సంబరాలను గ్రామాల్లో ఎలా చేయాలని, ఈ విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకుండా పోయిందని సర్పంచ్‌లు ఆవేదన వ్యక్తం చేశారు. మండల సర్వసభ్య సమావేశానికి ప్రజాప్రనిధులు వస్తున్నా ఆయా శాఖల మండల అధికారులు సమావేశాలకు డుమ్మాకొడుతున్నారని, తమ సమస్యలు ఎవరికి చెప్పుకోవాలని ఎంపీటీసీలు, సర్పంచ్‌లు అసహనం వ్యక్తం చేశారు. సమావేశానికి హాజరు కాని అధికారులపై తగు చర్యలు తీసుకోవాలని ఎంపీపీకి ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ చిట్టెం ఎలీశమ్మ, మండల కోఆప్షన్ సభ్యుడు డాక్టర్ ఖాదర్‌బాషా, డిప్యూటీ తహసీల్దార్ భారతీబాయ్, వ్యవసాయాధికారి షేక్ అబ్దుల్ రఫీక్, విద్యుత్‌శాఖ ఏఈ బాలగురవయ్య, ఎంఈవో వారణాసి గిరిధర్ శర్మ, అకవీడు డాక్టర్ ఖాదర్‌బాషా, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.



సమావేశంలో అధికారులను నిలదీస్తున్న ప్రజాప్రతినిధులు